
సాక్షి
తిరుపతి
ఆదివారం । 10 । డిసెంబర్ । 2023



స్కేటింగ్ రాష్ట్ర స్థాయి పోటీలు
తిరుపతి శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆంధ్ర స్పీడ్ స్కేటింగ్ రాష్ట్ర స్థాయి పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. - 8లో



జాతీయ లోక్‌అదాలత్
తిరుపతి కోర్టు ఆవరణలో శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో 317 కేసులు పరిష్కరించారు. - 8లో



పేదలకు అనుగ్రహం
వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల సొంతింటి కల సాకారం చేస్తోంది. ఇల్లులేని వారికి ఇంటి స్థలంతోపాటు ఇల్లు మంజూరు చేస్తూ అండగా నిలుస్తోంది. - 8లో

న్యూస్‌రీల్

తిరుచ్చిపై విహారం



తిరుచ్చిపై ఊరేగుతున్న శ్రీవారు

పుత్తూరు: అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారు తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శనివారం శ్రీవారి గ్రామోత్సవం సందర్భంగా వేకువ జామున సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొల్పి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. రాత్రి సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరులతో కలిసి తిరుచ్చి వాహనంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు.

12 నుంచి రాష్ట్ర స్థాయి సమ్మేళనం

తిరుపతి సిటీ: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ రెండో విడత అంతర కళాశాలల క్రీడాపోటీలతో పాటు సాహిత్య, సాంస్కృతిక సమ్మేళనం 2023–24ను తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాలలో నిర్వహించనున్నట్లు అసోసియేట్ డీన్ డాక్టర్ జీ.ప్రభాకరరెడ్డి తెలిపారు. ఈనెల 12 నుంచి 15వ తేదీ వరకు జరిగే ఈ సమ్మేళనానికి ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సుమారు 678 మంది విద్యార్థినీవిద్యార్థులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

నిండిన అరణియార్



అరణియార్ జలాశయం

పిచ్చాటూరు: పిచ్చాటూరు అరణియార్ జలాశయం నీటిమట్టం శనివారం సాయంత్రానికి 30 అడుగులకు చేరింది. వైఎస్సార్‌సీపీ పాలనలో వరుసగా నాలుగేళ్ల ప్రాజెక్టులో నీరు పూర్తి స్థాయిలో నిండినట్లయ్యింది. నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, నేడు ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో అరణియార్ క్రమం తప్పకుండా ప్రతి ఏడాదీ నిండుతోందని రైతులు నెమరవేసుకుంటున్నారు.

నేడు సాక్షి స్పెల్ బీ, మ్యాథ్ బీ

తిరుపతి ఎడ్యుకేషన్ : సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం తిరుచానూరు రోడ్డు, శ్రీనివాసపురంలోని హోలీ గ్రీన్ స్కూల్లో మ్యాథ్ బీ సెమీ ఫైనల్స్, స్పెల్ బీ క్వార్టర్ ఫైనల్స్ పోటీలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఉదయం 9 నుంచి 10 గంటల వరకు అన్ని కేటగిరిల్లో మ్యాథ్ బీ పోటీలు జరగనున్నాయి. అనంతరం స్పెల్ బీ పోటీలు కేటగిరీ వారీగా నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి 10.30 గంటల వరకు కేటగిరి–1, 10.30 నుంచి 11గంటల వరకు కేటగిరి–2, 11 నుంచి 11.30 గంటల వరకు కేటగిరి–3, 11.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కేటగిరి–4 విభాగంలో పోటీలను నిర్వహించనున్నారు. మ్యాథ్ బీ, స్పెల్ బీ పోటీలకు హాజరయ్యే విద్యార్థులు వారి స్కూల్ యూనిఫాం, ఐడీ కార్డు, పెన్ను, పెన్సిల్, రైటింగ్ ప్యాడ్‌ను వెంట తీసుకురావాలని నిర్వాహకులు సూచించారు.

శ్రీవారి సేవలో పెజావర్ మఠం పీఠాధిపతి



తిరుమల: శ్రీవారిని ఉడిపిలోని పెజావర్ మఠం పీఠాధిపతి శ్రీవిశ్వేశ ప్రసన్న తీర్థ స్వామీజీ దర్శించుకున్నారు. శనివారం తిరుమల శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ధైర్యం చెబుతూ.. భరోసానిస్తూ!



వరదయ్యపాళెంలోని ఇందిరానగర్ ప్రభుత్వ కార్యాలయాల వద్ద జోరుగా విద్యుత్ పునరుద్ధరణ పనులు

జిల్లాలో తుపాను సహాయక చర్యలను అధికారులు ముమ్మరం చేశారు. ఎక్కడికక్కడ బృందాలుగా ఏర్పడి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నారు. చెరువులకు పడ్డ గండ్లను, దెబ్బతిన్న రోడ్లను యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేస్తున్నారు. దెబ్బతిన్న ఇళ్లు, నీటమునిగిన పంటల జాబితాను సిద్ధం చేస్తున్నారు. రైతులకు ఎప్పటికప్పుడు సలహాలందిస్తూ ఉన్న పంటను కాపాడడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారు. వాలిపోయిన కరెంట్ పోళ్లు, దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేస్తున్నారు. వరద బాధితుల వెన్నుతట్టి తామున్నామంటూ నేతలు, అధికారులు భరోసానిస్తున్నారు.

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరం

- గండ్లు పూడ్చివేత చర్యలు వేగవంతం
- శరవేగంగా రోడ్లకు మరమ్మతులు
- అవిశ్రాంతంగా శ్రమిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు
- పంట నష్టనివారణలో జిల్లా యంత్రాంగం

తిరుపతి అర్బన్ : తుపాను గాయంతో కుమిలిపోవద్దు. పంట పోయిందని దిగులుపడొద్దు. గూడు చెదిరిందని అధైర్యపడొద్దు. మౌలికవసతులు లేవని కలవరపడొద్దు. పరిస్థితిని యథాతథ స్థితికి తీసుకొచ్చేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నాం. పరిహారాన్ని అందించడానికి నివేదికలు సిద్ధం చేస్తున్నాం. రోడ్లకు మరమ్మతులు చేస్తున్నాం. చెరువులకు పడ్డ గండ్లను పూడ్చివేస్తున్నాం. ఎవరూ ఆందోళన చెందొద్దు.. అండగా ఉంటాం..' అంటూ నేతలు అధికారులు తుపాను బాధితులకు భరోసానిస్తున్నారు. కంటిమీద కునుకులేకుండా.. రాత్రి పగలు తేడాలేకుండా తుపాను నష్టనివారణలో తలమునకలవుతున్నారు.

కష్టం..నష్టం

మిచాంగ్ తుపాన్‌తో తిరుపతి జిల్లాకు తీవ్ర నష్టం వాటిల్లింది. కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డితోపాటు అధికార యంత్రాంగం అప్రమత్తం కావడంతో ప్రాణనష్టం తప్పింది. తుపాన్ ప్రభావంతో ఈనెల 3, 4, 5 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా సరాసరి 431.5 మి.మీ వర్షపాతం నమోదైంది. అధిక వర్షపాతం నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పంట నష్టం, రోడ్లు, భవనాలు, చెరువు కట్టలు, కలుజులు, డ్యామ్‌లకు భారీ నష్టం వాటిల్లింది. తుపాన్ కారణంగా చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇప్పటి వరకు రూ.750 కోట్ల మేర నష్టం చేకూరింది. పంచాయతీ రోడ్లకు సంబంధించి చోటుచేసుకున్న నష్టాన్ని తాత్కలికంగా పూడ్చడానికే రూ.4.43 కోట్లు, శాశ్వతంగా రోడ్లు ఏర్పాటు చేయడానికి రూ.127.50 కోట్లు కావాల్సి ఉందని ఆ విభాగం జిల్లా అధికారి శంకర్‌నారాయణ వెల్లడించారు. 41 పంచాయతీ రోడ్లు 154.84 కి.మీ దెబ్బతినగా.. 394.18 కి.మీ రోడ్లు గుంతలమయమయ్యాయి. అదేవిధంగా ఆర్‌అండ్‌బీకి సంబంధించి 113 రోడ్లతోపాటు పలు భవనాలు దెబ్బతిన్నాయి. దాంతో రూ.343.23 కోట్ల మేర నష్టం వాటిల్లింది. ఇరిగేషన్ విభాగానికి సంబంధించి రూ.14 కోట్ల మేర నష్టం వాటిల్లినట్టు జలవనరులశాఖ చీఫ్ ఇంజినీర్ వెంకటరమణ, ఆ విభాగం జిల్లా అధికారి చెవిరెడ్డి సుధాకర్‌రెడ్డి వెల్లడించారు. ఇక ఆర్టీసీకి రూ.1.5 కోట్ల నష్టం వాటిల్లిందని డీపీటీఓ చెంగల్‌రెడ్డి తెలిపారు. మూడు రోజులపాటు నాలుగు డిపోలకు చెందిన సర్వీసులను పూర్తిగా నిలుపుదల చేసినట్టు వెల్లడించారు. మత్స్యశాఖకు సంబంధించి రూ.77.145 లక్షల వరకు నష్టం వచ్చినట్లు ఆ విభాగం జిల్లా అధికారి నాగరాజు వెల్లడించారు. పిచ్చాటూరు వద్ద మత్స్యక్షేత్రంలోని 10 లక్షల చేపపిల్లలు కొట్టుకుపోయాయన్నారు. అలాగే 115 బోట్లు దెబ్బతినడమే కాకుండా ఆక్వా చెరువుల్లోనూ నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. వ్యవసాయశాఖకు సంబంధించి 14 వేల హెక్టార్లలో వరి పంటకు నష్టం వాటిల్లినట్టు డీఏవో ప్రసాద్‌రావు వెల్లడించారు. నష్టాన్ని పూర్తిగా అంచనా వేయడానికి మరో రెండు రోజుల సమయం పడుతుందన్నారు. ఉద్యానశాఖకు సంబంధించి 664.96 హెక్టార్లలో వివిధ పంటలకు రూ.10.42 కోట్ల వరకు నష్టం ఏర్పడిందని ఆ విభాగం జిల్లా అధికారి దశరథరామిరెడ్డి వెల్లడించారు. ప్రధానంగా మిరప పంటతోపాటు కూరగాయల పంటలు, అరటి, బొప్పాయి తదితర 23 రకాల పంటలకు నష్టం సంభవించినట్లు చెప్పారు.

శ్రమిస్తూ.. పునరుద్ధరిస్తూ

వరదయ్యపాళెం: అధికారులు 100 శాతం గ్రామాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్టు నాగలాపురం విద్యుత్‌శాఖ ఏడీఈ చంద్రానాయక్ తెలిపారు. నాగలాపురం విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలోని వరదయ్యపాళెం, చెరివి, సత్యవేడు, నాగలాపురం, పిచ్చాటూరు మండలాల పరిధిలో దాదాపు 250 కరెంట్ స్తంభాలు నేలకొరిగాయి. దాదాపు రూ.20 లక్షలకు పైగా నష్టం వాటిల్లింది. మూడు రోజుల పాటు అవిశ్రాంతంగా శ్రమించి పల్లెకు 100శాతం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.



మనులాలపేటలో చేనేత మగ్గాలను పరిశీలిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

ప్రతి ఒక్కర్నీ ఆదుకుంటాం

సైదాపురం(వెంకటగిరి): మించాగ్ తుపాన్ కారణంగా ఇబ్బందులకు గురైన ప్రతి బాధితుడినీ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఆదుకుంటామని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. తుపాన్ కారణంగా మగ్గాల గుంతల్లోకి నీరు చేరడంతో నేత పనులు ఆగిపోయాయని, జీవనం కష్టమవుతోందని పలువురు చేనేతలు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన నేదురుమల్లి పట్టణంలోని మనులాలాపేటలోని మగ్గాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షం కారణంగా చేనేతల జీవనాధారం కరువైందని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వర్షం కారణంగా దెబ్బతిన్న ప్రతి చేనేత కుటుంబానికీ లబ్ధి చేకూరేలా ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. అలాగే 12వ వార్డులోని సవారిగుంట లోతట్టు ప్రాంతాల్లో నిల్వ చేరిన వర్షపునీటిని పరిశీలించారు. తక్షణమే మోటర్ల సహాయంతో నీటిను తరలించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులు ఆదేశించారు.



సవారిగుంట ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు

యుద్ధప్రాతిపదికన గండ్లకు మరమ్మతులు

చిట్టమూరు: తుపాను ప్రభావంతో చెరువులకు పడిన గండ్లకు యుద్ధ ప్రాదిపదికన మరమ్మతులు చేయిస్తున్నట్లు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు పేర్కొన్నారు. శనివారం ఆయన చిట్టమూరు మండలంలోని మల్లాం, కోగిలి గ్రామాల్లోని చెరువులకు పడిన గండ్లను పరిశీలించి, మరమ్మతు పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. నియోజకవర్గంలో చెరువులకు పడిన గండ్లను పూడ్చడానికి సుమారు రూ .8 కోట్లు అవసరమని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి వినతిపత్రం అందజేశామన్నారు. అలాగే మండలంలో దెబ్బతిన్న వరి నాట్లు, వరదల్లో కొట్టుకుపోయిన ఆక్వా గుంతలను పరిశీలించారు. నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటామని బాధితులకు భరోసా ఇచ్చారు.



చిట్టమూరు: మల్లాం చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు



తిప్పిరెడ్డిపల్లె: బొప్పాయి పంటను పరిశీలిస్తున్న సిబ్బంది



సవారిగుంట : వర్షపు నీరు మోటర్ల ద్వారా బయటకు పంపుతూ..



వాకాడు : నిత్యావసరాలు అందజేస్తున్న ఓ సేవా సంస్థ సభ్యులు



బుచ్చినాయుడుకండ్రిగ: కనమనంబేడులో విద్యుత్ పునరుద్ధరణ

పరిశ్రమ ఫలించె!



భూమి పూజలో మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీలు మిథున్ రెడ్డి, రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు (ఫైల్)

- పుంగనూరులో పారిశ్రామికాభివృద్ధి పరుగులు
- రూ.200 కోట్లతో శ్రీకాళహస్తి ఎలక్ట్రోస్టీల్‌కాస్టిక్ పైపుల ఫ్యాక్టరీ
- వెయ్యి మందికి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా అడుగులు



ఫ్యాక్టరీ పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్

పుంగనూరు : మండలంలోని ఆరడిగుంటలో శ్రీకాళహస్తి ఎలక్ట్రోస్టీల్‌కాస్టిక్ పైపుల ఫ్యాక్టరీ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పుంగనూరు నియోజకవర్గంలో పారిశ్రామికాభివృద్ధే లక్ష్యంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి సహకారంతో సుమారు 2వేల ఎకరాల్లో పారిశ్రామిక కారిడార్‌కు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా రెండు రిజర్వాయర్లు నిర్మించి పరిశ్రమలకు అవసరమైన నీరు సమకూర్చడంలో సఫలీకృతులైయ్యారు. ఈ క్రమంలో పైపుల ఫ్యాక్టరీని సుమారు 108 ఎకరాల్లో నిర్మించేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారు.

మరింత వేగవంతం

గత మార్చి 24న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఫ్యాక్టరీ ఎండీ ఉమాసింగ్ కేజ్రీవాల్‌తో కలసి నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఇప్పటికే ఫ్యాక్టరీకి అవసరమైన 133 కెవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు చేపట్టారు. ఈ క్రమంలో నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి త్వరలోనే ఫ్యాక్టరీని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సుమారు రూ.200 కోట్లతో నిర్మించే పైపుల ఫ్యాక్టరీ ద్వారా వెయ్యి మందికి ఉపాధి లభించనుంది.

పెరుగుతున్న భూముల ధరలు

మండలంలోని ఆరడిగుంట, మేలుందొడ్డి, వనమలదిన్నె ప్రాంతాలతో పాటు పలమనేరు నియోజకవర్గ సరిహద్దు ప్రాంతాల్లో భూముల ధరలు ఆకాశానంటుతున్నాయి. ఈ ప్రాంతంలో శ్రీకాళహస్తి పైపుల ఫ్యాక్టరీతో పాటు 800 ఎకరాలలో రూ.4.640 కోట్లతో జర్మన్ పెప్పర్ కంపెనీ ఎలక్ట్రికల్ బస్సుల పరిశ్రమ నెలకొల్పుతున్న క్రమంలో భూముల రేట్లకు రెక్కలు వచ్చాయి. మన రాష్ట్రంతోపాటు తమిళనాడు, కర్ణాటకకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈ ప్రాంతంలో భూముల కొనుగోలుకు ముందుకు వస్తున్నారు.

స్థానికులకు ఉపాధి



పడమటి నియోజకవర్గాలలో పరిశ్రమలు లేక వేలాది మంది నిరుద్యోగులు బయట రాష్ట్రాలకు వెళుతున్నారు. ఈ క్రమంలో స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు ఫ్యాక్టరీలు నెలకొల్పేందుకు చర్యలు చేపడుతున్నాం. దేశ స్థాయిలో పుంగనూరుకు పేరు ప్రతిష్టలు తీసుకురావడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సహకారం మరువలేనిది. ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు.
– పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మంత్రి

మరిన్ని పరిశ్రమలు



"పుంగనూరు నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశాం. నిరుద్యోగులకు ఉపాధి కల్పించేలా మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు చేస్తాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో, ప్రజల సహకారంతో పుంగనూరును పారిశ్రామిక కారిడార్‌గా తీర్చిదిద్దుతాం. అంతర్జాతీయ స్థాయిలో మన ఖ్యాతి ఇనుమడింపజేస్తాం.
– పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎంపీ, రాజంపేట

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో వలంటీర్ మృతి


సుభాషిణి(ఫైల్)

పాకాల: విద్యుత్ షాక్‌తో వలంటీర్ మృతిచెందిన ఘటన మండలంలోని శంఖంపల్లిలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం.. గ్రామానికి చెందిన వలంటీర్ సుభాషిణి(35) తన ఇంటికి అమర్చిన ఇనుప గేటుకు విద్యుత్ సరఫరా అవడంతో తెలియకుండా గేటును పట్టుకుంది. కేకలు విన్న ఆమె భర్త మురళి వెంటనే విద్యుత్ షాక్ నుంచి భార్యను తప్పించి సమీపంలోని పి.కొత్తకోట సీహెచ్‌సీకి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతురాలికి కుమార్తె యశశ్రీ(10), కుమారుడు డోలచంద్(09) ఉన్నారు. తల్లి మృతదేహం వద్ద పిల్లలు బోరున విలపించడం చూపరులను కంటతడి పెట్టించింది.

పేకాట రాయుళ్ల అరెస్ట్

తిరుపతి క్రైమ్: నగరంలోని ఎన్జీవో కాలనీలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. అలిపిరి సీఐ అబ్బన్న కథనం.. నగరంలో వివిధ ప్రాంతాలకు చెందిన నలుగురు వ్యక్తులు ఎన్జీవో కాలనీలో ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం వచ్చింది. తమ సిబ్బందితో దాడి చేయగా రూ.1049ను స్వాధీనం చేసుకొని.. నలుగురిని అరెస్ట్ చేసినట్టు సీఐ వెల్లడించారు. కేసు దర్యాప్తులో ఉంది.

అట్టహాసంగా మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం


జ్యోతి వెలిగించి పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి 42వ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా అటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ నైనారు శ్రీనివాసులు, మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.సుమతి, సైకం రామ్‌ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు. జాతీయ జెండాకు గౌరవ వందనం చేశారు. క్రీడాకారుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. జ్యోతి ప్రజ్వలన చేసి రాష్ట్ర స్థాయి పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలకు వివిధ జిల్లాల నుంచి సుమారు 500 మందికి పైగా మాస్టర్స్ అథ్లెటిక్స్ క్రీడాకారులు హాజరయ్యారు. మహిళలు, పురుషులకు విడివిడిగా హైజంప్, లాంగ్ జంప్, జావెలింగ్ త్రో, పరుగు, నడక పందెం వంటి వివిధ విభాగాల్లో పోటీలను నిర్వహించారు. మాస్టర్స్ అథ్లెటిక్స్ క్రీడాకారులు ఉల్లాసంగా, ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా స్ఫూర్తి, ప్రతిభను కనబరిచారు. ఆదివారం ఫైనల్స్ పోటీలు నిర్వహించి విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లను అందజేయనున్నారు.

పేదలకు అనుగ్రహం

రాష్ట్ర ప్రభుత్వం పేదలను అనుగ్రహించింది. బడుగులకు గూడు కల్పించాలన్న ఉద్దేశంతో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం అమలు చేసింది. సొంతిల్లు లేని అర్హులందరికీ ఇంటి స్థలంతోపాటు ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయం చేసింది. జగనన్న కాలనీల్లో విద్యుత్, తాగునీరు, రోడ్లు తదితర మౌలిక వసతులు కల్పించింది. ఫలితంగా నిరుపేదల సొంతింటి స్వప్నం నెరవేరింది. సొంత గూటికి చేరిన లబ్ధిదారులు చెప్పలేనంత ఆనందం పొందారు. దీనిపై పేదలు ఏమన్నారంటే.. – తిరుపతి అర్బన్

జనవాక్కు


కాయం జగనన్న లే అవుట్‌లో నిర్మించిన ఇళ్లు

అద్దె ఇళ్ల బాధలు తప్పాయి



ఉద్యోగం లేదు..చిన్న చిన్న పనులు, వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగించాల్సి ఉంది. ఈ క్రమంలో అద్దె ఇంట్లో జీవనం కష్టంగా మారింది. ప్రతి నెలా అద్దె చెల్లించాలంటే ఆందోళన చెందేవాళ్లం. జీవితంలో ఇంటి స్థలం ఎప్పుడు కొనుగోలు చేస్తాం. ఇంటిని ఎప్పుడు నిర్మించుకుంటామనే ఆలోచన ఉండేది. అయితే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత పేదలందరికీ ఇళ్లు పథకంలో మాకు ఇంటి పట్టా ఇచ్చారు. ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ఇచ్చారు. పొదుపు సంఘంలో మరో రూ.35 వేలు అందజేశారు. ఈ నగదుతో ఇంటిని నిర్మించుకున్నాం. అద్దె లేకుండా సొంతింట్లో ప్రశాంతంగా ఉంటున్నామంటే జగనన్న పుణ్యంగా భావిస్తున్నాం.

– అరిగెల వెంకటరత్నమ్మ, యలమంద్యం, రేణిగుంట మండలం

జగనన్న అండగా నిలిచాడు



నా భర్త ఏడాది క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దిక్కుతోచని స్థితి. ఆర్థిక ఇబ్బందులు పడ్డాను. ఆయన బతికుండే సమయంలో సొంతిల్లు కట్టుకుందామని ఎంతో ఆశ పడ్డారు. ఆయన అకాల మరణంతో నాకు ఆసరా లేకుండా పోయింది. అయితే సీఎం వైఎస్ జగనన్న ప్రభుత్వం నాకు అండగా నిలిచింది. ఇప్పుడు ఇల్లు కూడా మంజూరు చేయడంతో ఇంటి నిర్మాణానికి పూనుకున్నాం. నా భర్త కలలను నెరవేర్చి, సొంతింట్లో ఉండాలనే ఎంతో కష్టపడుతున్నాను. మరోవైపు వితంతు పింఛను మంజూరు చేయడంతో వాటిపై ఆధారపడుతూ ఇద్దరు పిల్లలను చదివించుకుంటూ కూలీ పనులు చేసుకుంటున్నాను. అమ్మ ఒడి ద్వారా అదనంగా నన్ను ఈ ప్రభుత్వం ఆదుకుంది. ఈ ప్రభుత్వం మేలు ఎప్పటి మరువలేను.

– ప్రసన్న, ఎగువవీధి ఐతేపల్లి, చంద్రగిరి మండలం

జగనన్నతో నెరవేరిన సొంతింటి కల



మా సొంతింటి కల ఎట్టకేలకు జగనన్నతో నెరవేరిందని గట్టిగా నమ్ముతున్నాం. సొంతిల్లు లేక సుమారు 20 ఏళ్లగా అద్దె ఇంట్లోనే నివాసం ఉన్నాం. ఆ తరుణంలో చాలా కష్టతరంగా ఉండేది. జగన్న కాలనీలో ఇంటి స్థలం మంజూరు చేయడంతోపాటు, ఇంటి నిర్మాణానికి సహకారం అందించడంతో మా కల నెలవేరింది. ఈ స్థాయిలో పేదలకు సాయం చేసిన ముఖ్య మంత్రిని ఇప్పటి వరకు చూడలేదు. అంతేకాదు లెక్కలేనన్ని సంక్షేమ పథకాలు అమలు చేశారు. ఆయన పథకాలతో లబ్ధి పొందని కుటుంబం లేదు. ఆయన ప్రతి ఇంటికీ మంచి చేశారు. తప్పకుండా ఆయనకు అండగా ఉంటాం.

– చల్లా హనుమంతరావు, వెంకటగిరి టౌన్

సొంత గూడు దొరికింది



నాకు 1992లో తిరుపతి సమీపంలోని పుదిపట్ల గ్రామానికి చెందిన ఈశ్వరయ్యతో వివాహం జరిగింది. 2012లో భర్త అనారోగ్యంతో చనిపోయాడు. దీంతో పుట్టింటికి వచ్చేశాను. అమ్మవాళ్లది చిన్నపెంకుటిళ్లు కావడంతో వాళ్ల ఇంట్లో ఉండేందుకు వీలు పడక పోవడంతో మరో అద్దె ఇంట్లో ఉండేదాన్ని. సొంత స్థలం కోసం అప్పటి ప్రభుత్వంలో అర్జీ పెట్టుకున్నాను. అయినా ప్రయోజనం లేదు. కూలి పనికి వెళ్లి ఇద్దరు పిల్లన్ని పెంచడం, అద్దె కట్టడం చాలా కష్టంగా ఉండేది. జగనన్న ప్రభుత్వం వచ్చాక మా ఊర్లోని వలంటీరు వచ్చి ఇంటి స్థలం, ఇల్లు మంజూరు చేస్తామని దరఖాస్తు తీసుకున్నారు. ఇల్లు కట్టించారు. ఎంతో సంతోషంగా ఉంది. జగనన్నకు కృతజ్ఞతలు.

– మారెం వనిత, కాళమనాయుడుపేట, సత్యవేడు మండలం

18 నుంచి మహతిలో జాతీయ నాటక పోటీలు


సమావేశంలో మాట్లాడుతున్న కోనేటి సుబ్బరాజు

తిరుపతి కల్చరల్: స్థానిక మహతి కళాక్షేత్రంలో ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు ఎస్ఆర్ నాట్య కళాపరిషత్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి నాటక, శాస్త్రీయ నృత్య, భగవద్గీత పోటీలు నిర్వహించనున్నట్లు పరిషత్ అధ్యక్షుడు కోనేటి సుబ్బరాజు తెలిపారు. ప్రెస్ క్లబ్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్ఆర్ నాట్య కళాపరిషత్ 60వ వార్షికోత్సవంలో భాగంగా కళోత్సవాల పేరుతో ఐదు రోజుల పాటు ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు 38 సాంఘిక నాటికలు, 27 పద్యనాటకాలు ఎంట్రీలు వచ్చాయని, పరిశీలన అనంతరం 8 సాంఘిక నాటికలు, 5 పద్య నాటకాలను తుది పోటీలకు ఎంపిక చేసినట్లు చెప్పారు. పరిషత్ 60వ వార్షికోత్సవం సందర్భంగా 64 కళలను దృష్టిలో ఉంచుకొని ఆయా రంగాల్లో సేవలందిస్తున్న 64 మంది నటీనటులకు, హార్మోనిస్టులు, మేకప్‌మెన్‌లను సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. జాతీయ నాటక పోటీల్లో ప్రతి రోజు సాయంత్రం 5 గంటల నుంచి ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. చివరి రోజు 22న పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందని తెలిపారు. ఐదు రోజుల పాటు నిర్వహించే జాతీయ స్థాయి నాటక, నృత్య, భగవద్గీత పోటీలకు కళాభిమానులు, కళాకారులు, ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఎస్ఆర్ నాట్య కళాపరిషత్ సహాయ కార్యదర్శులు కె.కేశవులు రెడ్డి, చంద్రబాబు, ఉపాధ్యక్షులు గోపాలరావు, ఎస్.వెంకటస్వామి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పోటీలలో ప్రదర్శనలివీ

జాతీయ పోటీలలో 18న సాయంత్రం ఆమని... నీ గమనమెక్కడ సాంఘిక నాటిక, మాయాబజార్ పౌరాణిక నాటకం, 19న దానానికి దారులెన్నో, శ్రీకృష్ణ లీలలు పౌరాణిక నాటిక, 20న థింక్, విముక్తి సాంఘిక నాటికలు, ఘంటసాల పౌరాణిక నాటకాలు ప్రదర్శించనున్నారు. 21న అసరసాల, కాపలా సాంఘిక నాటికలు, బాలనాగమ్మ పౌరాణిక నాటకం, 22న మాజీ యువకులు, పక్కింటి మొగుడు సాంఘిక నాటికలు, భక్త ప్రహ్లాద పౌరాణిక నాటక ప్రదర్శనలు ఉంటాయి.

ఘనంగా స్పీడ్ స్కేటింగ్ రాష్ట్ర స్థాయి పోటీలు


స్కేటింగ్ చేస్తున్న క్రీడాకారులు

తిరుపతి ఎడ్యుకేషన్: స్థానిక శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జిల్లా స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన రెండు రోజుల ఆంధ్ర స్పీడ్ స్కేటింగ్ రాష్ట్ర స్థాయి పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా తిరుపతి జిల్లా చీఫ్‌కోచ్ సయ్యద్ సాహెబ్, స్పీడ్ స్కేటింగ్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి మురుగానందం, టెక్నికల్ కమిటీ సభ్యుడు ఎం.గౌతం పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో పాల్గొన్న వివిధ జిల్లాలకు చెందిన స్కేటింగ్ క్రీడాకారులు, అలాగే వివిధ ఆశ్రమాలకు చెందిన విద్యార్థులు సుమారు 190 మందికి వివిధ వయో విభాగాల వారీగా పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు ఆదివారం బహుమతులు అందజేయనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి జీ.ప్రతాప్, సంయుక్త కార్యదర్శి సంతోష్ పూసర్ల తెలిపారు.

జాతీయ లోక్‌అదాలత్‌లో 317 కేసుల పరిష్కారం


లోక్ అదాలత్‌లో కేసును పరిష్కరిస్తున్న జడ్జి గురునాథ్

తిరుపతి లీగల్: తిరుపతి కోర్టు ఆవరణలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 317 కేసులు పరిష్కారమైనట్లు తిరుపతి మూడవ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ గురునాథ్ తెలిపారు. పరిష్కారమైన కేసుల్లో 193 క్రిమినల్ కేసులు, 37 సివిల్, 12 మోటారు వాహన ప్రమాద కేసులు, 10 వివాహ సంబంధ కేసులు, ఒక భూ సేకరణ కేసు ఉన్నట్లు న్యాయమూర్తి పేర్కొన్నారు. 317 కేసులు పరిష్కరించి నాలుగు కోట్ల 87 లక్షల 85 వేల 358 రూపాయల విలువ చేసే పరిహారాన్ని బాధితులకు అందజేసినట్లు వెల్లడించారు. అధ్యక్షులుగా జడ్జి గురునాథ్, పదవ అదనపు జిల్లా జడ్జి రామచంద్రుడు, అదనపు సీనియర్ సివిల్ జడ్జి సునీత రాణి, జూనియర్ సివిల్ జడ్జిలు సత్యకాంత్‌కుమార్, కోటేశ్వరరావు, సంధ్యారాణి, గ్రంధి శ్రీనివాస్, వై.సరితలు వ్యవహరించారు. దిశ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఓ చీటింగ్ కేసులో తిరుపతి నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ ఇరువురితో చర్చించి బాధిత మహిళలకు 12 లక్షల రూపాయలను పరిహారంగా అందజేసినట్లు తెలిపారు.

నేడు లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక అభిషేకం

తిరుమల: తిరుమల మొదటి ఘాట్ రోడ్డులోని నడక మార్గం చెంత వెలసి ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించనున్నారు. కార్తీక మాసంలో స్వాతి తిరునక్షత్రం సందర్భంగా ఏటా ఇక్కడ ప్రత్యేక అభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. మూలమూర్తికి ఉదయం పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపుతో విశేషంగా అభిషేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు.

బేడి ఆంజనేయస్వామి ఆలయంలో..

తిరుమల శ్రీవారి ఆలయం ఎదురుగా వెలసి ఉన్న శ్రీ బేడి ఆంజనేయస్వామివారికి ఆదివారం ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించనున్నారు. కార్తీక మాసం చివరి ఆదివారం సందర్భంగా ఏటా ఆలయంలో ప్రత్యేక అభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. మూలమూర్తికి ఉదయం పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపుతో అభిషేకం నిర్వహించి, విశేషంగా అలంకరించి పూజలు చేపట్టనున్నారు.

టిప్పర్ ఢీకొని మత్స్యకారుడి మృతి


ఆందోళన చేస్తున్న మత్స్యకారులతో మాట్లాడుతున్న ఎస్ఐ అంజిరెడ్డి

చిల్లకూరు: తీర ప్రాంతంలోని క్రిష్ణపట్నం పోర్టు సౌత్ గేటుకు సమీపంలో బైక్‌లో వెళుతున్న మత్స్యకారుడ్ని పోర్టుకు వెళుతున్న టిప్పర్ వెనుక నుంచి ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందగా.. అతని కుమారుడికి తీవ్ర గాయాలు అయిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని లింగవరానికి చెందిన అక్కగారి కరిముల్లా(50), అతని కుమారుడు బాబు బైక్‌లో క్రిష్ణపట్నం పోర్టుకు వెళుతున్నారు. ఈ క్రమంలో సౌత్ గేట్ వద్ద ఉన్న బ్రిడ్జి సమీపంలోకి చేరుకోగానే పోర్టుకు వెళుతున్న టిప్పర్ వెనుక నుంచి వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొంది. దీంతో కరిముల్లా అక్కడికక్కడే మృతి చెందగా.. కుమారుడు బాబుకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న గుమ్మళ్లదిబ్బ, లింగవరం గ్రామాలకు చెందిన మత్స్యకారులు అక్కడకు చేరుకుని ఆందోళన చేపట్టారు. పోర్టు ప్రతినిధులు అక్కడికి చేరుకుని వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఆపై ఎస్ఐ అంజిరెడ్డి మత్స్యకారులతో మాట్లాడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.